## క్లుప్తంగా

### మున్సిపల్ కమిషనర్ బదిలీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపల్ కమిషనర్ వై.శంకర్‌నాయక్ బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు డెప్యుటేషన్‌పై మున్సిపల్ కమిషనర్‌గా ఆయన ఇక్కడికి వచ్చారు. ఆయనను గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ హరినారాయణన్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నూతన మున్సిపల్ కమిషనర్‌గా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ బి.రమ్యకీర్తన నియమితులయ్యారు.

### సాగర్ జలాలతో రైతులను ఆదుకోవాలి

వైఎస్సార్ సీపీ నేతలు, రైతుల డిమాండ్

ముసునూరు: వేంపాడు, నూజివీడు మేజర్ కాలువలకు తక్షణమే సాగర్ జలాలు విడుదల చేయించి పంటలను, పశువులను రక్షించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగ వల్లేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల యూత్ అధ్యక్షుడు గూట్రు రంగారావు అధ్యక్షతన ముసునూరులో పార్టీ నేతలు, రైతులతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చెరువుల్లో చుక్క నీరు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నాగార్జున సాగర్‌లో నీటి మట్టం పెరిగినందున నూజివీడు, వేంపాడు మేజర్ కాలువలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ సుధాకర్, రేగుల గోపాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

### ఎంపీయూపీ పాఠశాల తనిఖీ

తిరువూరురూరల్: చౌటపల్లి ఎంపీయూపీ స్కూల్‌ను మంగళవారం ఎంపీపీ గద్దల భారతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో పాఠశాలలో 30 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులున్నారు. గతంలో 150 మందికి పైగా విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో గణనీయంగా విద్యార్థులు తగ్గిపోవడంపై ఎంపీపీ ఆరా తీశారు. అన్ని తరగతులనూ కలిపి ఒకేచోట బోధిస్తుండటంపై ఉపాధ్యాయులను ఆమె ప్రశ్నించారు. విద్యార్థుల చేరికకు తగు శ్రద్ధ చూపాలని ఎంపీపీ సూచించారు.

### రేపు దేవస్థానం షాపుల అద్దె హక్కునకు వేలం

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో 1, 2, 3 షాపుల అద్దె హక్కునకు ఈ నెల 8వ తేదీన బహిరంగ టెండర్ కం వేలం నిర్వహిస్తామని ఆలయ ఈఓ సీతారామయ్య తెలిపారు. పాల పొంగళ్లకు గ్యాస్ పొయ్యిలు అద్దె హక్కునకు వేలం జరుగుతుందన్నారు. టెండర్ షెడ్యూలు ఫారంను బాక్సులో 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు వేయాలన్నారు. 8వ తేదీ ఉదయం 10 గంటలకు దేవదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో టెండర్ బాక్సు తెరిచి వేలం నిర్వహిస్తామన్నారు.

### విరాళాల సేకరణ

ఎ.కొండూరు: వయనాడ్ బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో రామచంద్రాపురం గ్రామంలో మంగళవారం విరాళాలు సేకరించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ సేకరించిన విరాళాలను రాష్ట్ర పార్టీ ద్వారా కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి పంపుతామని చెప్పారు. సీపీఎం నాయకులు ఆనందరావు, అంబిరెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

- తిరువూరు: వయనాడ్ బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో తిరువూరు పట్టణంలో రెండురోజుల పాటు విరాళాలు సేకరించారు. సేకరించిన మొత్తం రూ.21,860లను పార్టీ ద్వారా కేరళ సీఎం సహాయనిధికి పంపుతామని సీపీఎం పట్టణ కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

### సేవా కార్యక్రమాలకు సహకరించాలి

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరించాలని సొసైటీ చైర్మన్, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. శివహరిప్రసాద్, సెక్రటరీ, ట్రెజరర్ గూడూరు నాగిరెడ్డిలు మైలవరం తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డిని కోరారు. తహసీల్దార్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువతో సత్కరించారు.

### రోగులకు సత్వర సేవలందించాలి

చౌటపల్లి(తిరువూరురూరల్): గ్రామాల్లో జ్వరాలు వ్యాపిస్తున్నందున రోగులకు సత్వర వైద్య సేవలు అందించాలని తిరువూరు ఎంపీపీ గద్దల భారతి వైద్యులను కోరారు. చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఆస్పత్రి వైద్యాధికారి పూజిత, సీహెచ్‌ఓ దీవెనమ్మ పాల్గొన్నారు.

### కౌంటర్ కేసుల నమోదు

గంపలగూడెం: గంపలగూడెం మండలం తునికిపాడులో మంగళవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై ఇరువర్గాల నుంచి వేర్వేరుగా అందిన ఫిర్యాదు మేరకు కౌంటర్ కేసులు నమోదు చేశారు. ఎస్ఐ ఎస్. శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. ఘర్షణలో ఇరువర్గాలకు చెంది ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈవిషయమై రామిశెట్టి కృష్ణ ఫిర్యాదు మేరకు రామిశెట్టి సత్యనారాయణ మరో నలుగురిపైన, అదేవిధంగా వాసిరెడ్డి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు రామిశెట్టి కృష్ణ, మరో ఇరువురిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. డీసీపీ హరికృష్ణ, ఏసీపీ మురళీమోహన్, తిరువూరు సీఐ నభీలు గ్రామంలో పర్యటించి ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

# బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

తిరువూరు సీడీపీఓ సత్యవతి

గంపలగూడెం: వివాహ వయస్సు రాకుండా పిల్లలకు బాల్యంలోనే వివాహాలు చేయడం వల్ల బాలికలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సత్యవతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గంపలగూడెం ఎస్సీ, బీసీ కాలనీలోని 182వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాల్య వివాహాల వల్ల నష్టాలపై తల్లులకు, కిశోర బాలికలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. తొలుత గ్రామంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ చిన్న వయస్సులో పెళ్లి చేసుకోవడం వల్ల పుట్టే పిల్లలు కూడా అనారోగ్యంతో ఉంటారన్నారు. సర్పంచ్ కోట పుల్లమ్మ మాట్లాడుతూ కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు ఐసీడీఎస్ సిబ్బంది సూచించే సలహాలు పాటించాలని, తగిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. పుట్టిన పిల్లలకు తల్లిపాలను తప్పక పట్టాలని చెప్పారు. ఐసీడీఎస్ గంపలగూడెం సెక్టార్ సూపర్‌వైజర్ మునిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



చెవుటూరులో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

### తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

జి.కొండూరు: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఇందుపల్లి అన్నమ్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల పరిధి చెవుటూరు బాపూజీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, తల్లులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కాలనీలో ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ

నూజివీడు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి అన్నారు. ముస్లింపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

- మల్లేల(తిరువూరురూరల్): మల్లేల అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. నవజాత శిశువుకు ముర్రుపాలు పట్టించాలని మహిళా సంరక్షణ కార్యదర్శి విజయలక్ష్మి సూచించారు. సంపూర్ణ పోషకాహార ఆవశ్యకతను వివరించారు.
- చాట్రాయి: పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించాలని నూజివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ నూరానీ అన్నారు. చాట్రాయి వెలుగు కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఎంపీడీఓ మంగా కుమారి, పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

నూజివీడు: పల్లెర్లమూడిలో నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. బాలిక కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించారు. కుటుంబానికి కొంత ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నూజివీడు మండల అధ్యక్షుడు పోలిమెట్ల శివ తదితరులు పాల్గొన్నారు.

- నూజివీడు: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నూజివీడు ఆర్డీఓ వై.భవానీ శంకరికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. తొలుత రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహ, ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామలారాణి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు పాల్గొన్నారు.



బాలిక తండ్రితో మాట్లాడుతున్న ప్రతాప్ అప్పారావు

## ఆర్టీసీ డ్రైవర్ల నిజాయతీ

ప్రయాణికురాలికి నగదు, నగల పర్సు అందజేత

తిరువూరు: బస్సులో విలువైన నగదు, నగలు మరచిపోయిన ఓ ప్రయాణికురాలికి వాటిని భద్రంగా తిరిగి ఇచ్చిన తిరువూరు డిపో ఆర్టీసీ డ్రైవర్లు పలువురి అభినందనలు అందుకున్నారు. ఈ నెల 4న తిరువూరు నుంచి మంత్రాలయం వెళ్లే తిరువూరు డిపో బస్సులో గుంటూరుకు చెందిన వీరలక్ష్మి విజయవాడ నుంచి ప్రయాణించారు. కర్నూలులో బస్సు దిగి వెళ్లే సమయంలో ఆమె పర్సును బస్సులో మరచిపోయారు. వెంటనే ఆమె తిరువూరు డిపో ఎంక్వయిరీ నెంబరుకు ఫోన్ చేసి డ్రైవరు ఫోన్ నెంబర్ తీసుకుని ఆయనకు ఫోన్ చేశారు. తాను ప్రయాణించిన బస్సులో సీటు వివరాలు తెలియజేసి తాను పర్సు మరచిపోయిన విషయం తెలిపారు. డ్రైవర్లు భాస్కరరావు, అంకమరావులు బస్సులో ఆమె సీటు వద్ద పడిపోయిన పర్సును గుర్తించి భద్రపరిచారు. తిరుగు ప్రయాణంలో కర్నూలు–1 డిపో ట్రాఫిక్ అధికారి సమక్షంలో పర్సులో ఉన్న రూ.3,500 నగదుతో పాటు రూ.లక్ష విలువైన బంగారపు నానుతాడు, రెండు ఏటీఎం కార్డులను ఆమెకు భద్రంగా అప్పగించారు. ప్రయాణికురాలు వీరలక్ష్మి డ్రైవర్ల నిజాయతీని కొనియాడారు. తిరువూరు ఆర్టీసీ డీఎం వేణు డ్రైవర్లను అభినందించారు.



ప్రయాణికురాలికి పర్సు అందజేస్తున్న డ్రైవరు అంకమరావు

### సూక్ష్మ సేద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

గంపలగూడెం: ఏపీ సూక్ష్మ సేద్య పథకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ తెలిపారు. ఈ పథకం కింద బిందు(డ్రిప్), తుంపర (స్ప్రింక్లర్లు) రైతులకు సబ్సిడీపై అందజేస్తామన్నారు. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్నవారికి 90 శాతం రాయితీని గరిష్ఠంగా రూ.2.18 లక్షలు, పైబడిన రైతులకు 50 శాతం రాయితీతో గరిష్ఠంగా రూ.3.10.లక్షలు సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందజేస్తామన్నారు. తుంపర సేద్యానికి చిన్నసన్నకారు రైతులకు 55 శాతం, ఎక్కువ భూమి ఉన్న రైతులకు 45 శాతం రాయితీతో స్ప్రింక్లర్లు అందజేస్తారని వివరించారు. కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, 1బీ పత్రం, ఎఫ్ఎంబీ, బ్యాంక్ పాస్ పుస్తకాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సూచించారు.

### ఎమ్మెల్యే వసంతను కలిసిన తహసీల్దార్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇబ్రహీంపట్నం, జి.కొండూరు తహసీల్దార్లు వై. వెంకటేశ్వర్లు, చాట్ల వెంకటేశ్వర్లు, మైలవరం తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, రెడ్డిగూడెం సర్పంచ్ జె. సుశీలాదేవి, విజయవాడ రూరల్ తహసీల్దార్ బి. సుగుణ మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్(కేపీ)ని మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చిన వారు కృష్ణ ప్రసాద్‌కు మొక్కలను అందజేశారు.

## సంక్షిప్తంగా...

- **మానసిక ఆరోగ్యంపై అవగాహన**

ఇబ్రహీంపట్నం: మానసిక ఆరోగ్యం, ఆత్మస్థైర్యంపై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో స్వాంతన కో–ఆర్డినేటర్ కేశవ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి గురైన వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించే అంశాలపై ఏఎన్ఎంలు, ఆశాలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో మానసిక స్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడే వారికి రక్షణగా ఏఎన్ఎంలు నిలవాన్నారు. వారిలో మానసిక స్థైర్యం పెంచాలని సూచించారు. అటువంటి వారికి వాసవ్య మహిళా మండలి ఆసరాగా ఉంటుందని చెప్పారు.

- **సీఆర్పీల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా డీఎస్ఆర్**

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (సీఆర్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇబ్రహీంపట్నానికి చెందిన సీఆర్పీ దొంతమాల నాగేశ్వరరావు ఎంపికయ్యారు. విజయవాడ జాక్ అండ్ జిల్ రైల్వే పాఠశాలలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వి.విష్ణువర్ధనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగేశ్వరరావును పలువురు అభినందించారు.

- **కచ్చా డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు**

గంపలగూడెం: గంపలగూడెం బీసీ కాలనీలో కచ్చా డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపును గ్రామ పంచాయతీ మంగళవారం చేపట్టింది. సర్పంచ్ కోట పుల్లమ్మ, ఈఓ జి. శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో డ్రెయినేజీలపై ఉన్న ఆక్రమణలను సిబ్బందిచే పగులగొట్టించి పూడిక తొలగించారు. దీంతో నీరు దిగువకు పారే అవకాశం కలిగింది.

- **రామాలయంలో శ్రావణ మాస పూజలు**

తిరువూరు: శ్రావణ మాసం సందర్భంగా తిరువూరు కోదండ రామాలయంలో నిత్య పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సీతారామచంద్రులకు విశేష పూజలతో పాటు విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తున్నారు. ఆండాళ్ తిరునక్షత్ర సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన జరిపారు.

- **కరపత్రాల ఆవిష్కరణ**

తిరువూరురూరల్: సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు తనవంతుగా వివిధ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తానని, ఇందుకు సహకరించాలని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి రాంప్రదీప్ సర్పంచి కృష్ణవేణిని కోరారు. మంగళవారం సర్పంచిని కలిసిన రాంప్రదీప్ గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించి కరపత్రాలను ఆవిష్కరించారు.

- **కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం**

మైలవరం: మైలవరం మండల పరిషత్ కార్యాలయం రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు ఇంకొల్లు జమలయ్య ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిషేకం చేశారు. డాక్టర్ కొంగల రామారావు, నాయకులు కోళ్లపాటి రత్నం, బి. యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

- **పూర్వ విద్యార్థుల వితరణ**

అమ్మిరెడ్డిగూడెం(గంపలగూడెం): అమ్మిరెడ్డిగూడెం ఏబీఎం హైస్కూల్ పూర్వ విద్యార్థులు తమతో చదువుకున్న విద్యార్థి కుటుంబానికి మంగళవారం తమ వంతు సహాయం చేశారు. తిరువూరు మండలం రోలుపడికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి పానం సురేష్ (32) ఇటీవల అనారోగంతో మృతి చెందాడు. నాటి పూర్వ విద్యార్థులు రూ.20 వేలు సేకరించి ఈ మొత్తాన్ని పోస్టాఫీస్‌లో మహిళా సమ్మాన్‌నిధి కింద భార్య రాజ్యలక్ష్మి పేరున ఖాతా తెరిచి నగదు జమ చేశారు.

- **బోనస్ పంపిణీ**

జి. కొండూరు: కృష్ణా మిల్క్ యూనియన్ మైలవరం క్లస్టర్ పరిధిలోని 104 గ్రామాలకు సంబంధించిన పాడి రైతులకు రూ. 1.50 కోట్ల బోనస్‌ను పంపిణీ చేశామని మైలవరం క్లస్టర్ మేనేజర్ కె. వెంకటేశ్వరరావు తెలిపారు. కొత్తరెడ్డిగూడెం పాలకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు టి. శ్రీనివాసరావు, కె. చంద్రశేఖర్‌రావు, కె. శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- **150 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు**

తిరువూరు: తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో సోమవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. డివిజన్‌లోని ఐదు మండలాల్లో 150 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. తిరువూరులో 58.6 మిల్లీమీటర్లు, గంపలగూడెంలో 45 మి.మీ, విస్సన్నపేటలో 17.4, ఎ.కొండూరులో 16.2, రెడ్డిగూడెంలో 13.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని ఆర్డీఓ కార్యాలయం తెలిపింది.

- **సీపీఐ నాయకుడు వెంకటేశ్వరరావు మృతి**

నూజివీడు: సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు (54) గుండెపోటుతో మృతి చెందారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

- **ఆన్‌లైన్‌లో ఐటీఐ అడ్మిషన్లు**

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఖాళీలు గల వివిధ ట్రేడ్‌లలో అడ్మిషన్‌లను నిర్వహిస్తున్నామని, అర్హత కలిగిన వారు ఈ నెల 26న సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రధానాధికారి దేవరకొండ భూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు కాపీని ప్రింట్ తీసుకుని ఈ నెల 27లోగా కళాశాలకు వచ్చి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 29న ఐటీఐ కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

- **విద్యార్థులకు పుస్తకాల పంపిణీ**

ఆగిరిపల్లి: సగ్గూరు మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయిని అరుణ, మానవత స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ గంట సత్యనారాయణ, ఇందిరాదేవి, గణేష్, రామచంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి

డీఎంహెచ్‌ఓ సుహాసిని

నెమలి(గంపలగూడెం): గ్రామంలో విష జ్వరాలు ప్రబలి పలువురు ఇబ్బందులు పడుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు జిల్లా వైద్యాధికారి సుహాసిని, జిల్లా మలేరియా అధికారి మోతేబాబు సోమవారం అర్ధరాత్రి నెమలిలో ఆకస్మికంగా పర్యటించారు. పలువురిని విచారించి పరిస్థితిని తెలుసుకున్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సరైన వైద్య సదుపాయం కల్పించాలంటూ గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీల వైద్యులను ఆదేశించారు. దీంతో మంగళవారం వైద్యులు శృతి, సురేష్‌ల పర్యవేక్షణలో గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు గ్రామంలో పర్యటించి ఎవరైనా జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారా అని ఆరా తీశారు. అనుమానం ఉన్న 250 మంది నుంచి రక్త నమూనా సేకరించి పరీక్షలు జరిపినట్లు వైద్యులు శృతి తెలిపారు. ఎవరికీ డెంగీ జ్వరాలు లేవని, కొందరు నార్మల్ జ్వరంతో ఉండగా వైద్యసేవలు అందజేశామని తెలిపారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

## పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలి

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు

తిరువూరు: సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున అధికారులు పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరువూరులోని ఆయన నివాసంలో నగర పంచాయతీ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరాల వ్యాప్తి, పారిశుద్ధ్య సమస్యలు, దోమల విజృంభణపై చర్చించారు. తిరువూరు పట్టణంలో దోమల నిర్మూలనకు ఎబేట్ మందు పిచికారీ చేయడంతో పాటు అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయాలని స్వామిదాసు నగర పంచాయతీ అధికారులకు సూచించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారిన ప్రజలు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కౌన్సిలర్ల సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

### ఎల్ఐసీ శాటిలైట్ శాఖ వార్షికోత్సవం

తిరువూరు: తిరువూరులోని భారతీయ జీవిత బీమా సంస్థ శాటిలైట్ శాఖ 16వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. శాఖా కార్యాలయంలో సీనియర్ బ్రాంచి మేనేజరు సుధాకర్ కేక్ కట్ చేసి మాట్లాడుతూ నూజివీడు ఎల్ఐసీ కార్యాలయానికి అనుబంధంగా ఉన్న తిరువూరు శాటిలైట్ శాఖ సాధించిన ప్రగతిని ఆయన వివరించారు. కార్యాలయ మేనేజర్ రమేష్, ఏఓలు వెంకటేశ్వర్లు, ఫరీద్, ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.